క్లుప్తంగా

నేల ఆరోగ్యాన్ని సంరక్షించాలి

పమిడిముక్కల: రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించాలని, నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మండల వ్యవసాయ అధికారి గణేష్‌రెడ్డి తెలిపారు. మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో గురువారం ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం ఖరీఫ్–2025 కార్యాచరణ ప్రణాళికపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీఆర్‌పీలు అరుణ, నాగలక్ష్మి, జీవామణి ఘన జీవామృతం, ద్రవ జీవామృతం తయారు చేసి చూపించారు.

వృద్ధులకు అన్నదానం

గుడివాడటౌన్: శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం అధ్యక్షుడు పుట్టి హరికుమార్ ఆధ్వర్యంలో గురువారం వృద్ధులకు అన్నదానం చేశారు. స్థానిక పాటిమీద గల కరుణాపీఠం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు తన సొంత నిధులతో భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు బొగ్గరపు తిరుపతయ్య, యాదవ సంఘం నాయకులు జాజుల తాతారావు, ఎన్. వెంకట రామారావు, కె.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు

ముదినేపల్లి రూరల్: వివిధ కార్పొరేషన్ల సబ్సిడీ రుణాల లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు అభ్యర్థులు పోటెత్తారు. కాపు, బీసీ, ఈబీసీ కార్పొరేషన్ల రుణాల కోసం మండల వ్యాప్తంగా 1,070 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 16 గ్రామాలకు చెందిన 520 మంది అభ్యర్థులకు తొలిరోజు ఇంటర్వ్యూలు జరిపారు. మిగిలిన వారికి శుక్రవారం ఇంటర్వ్యూలు జరుగుతాయి. ఎంపీడీవో వై.రామకృష్ణ, మండలంలోని బ్యాంకు మేనేజర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

కామర్స్ ఫెస్ట్‌లో ఏఎన్నార్ విద్యార్థుల ప్రతిభ

గుడివాడటౌన్: కామర్స్ ఫెస్ట్ 2025లో ఏఎన్నార్ కళాశాల విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ గురువారం తెలిపారు. విజయవాడ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఈ పోటీలలో బి.కామ్ కంప్యూటర్స్ విద్యార్థులు పి.మణికంఠ, ఎన్.భవాని, కె.చందు బిజినెస్ క్విజ్ విభాగంలో మొదటి స్థానం కైవసం చేసుకుని పతకాలు సాధించారని తెలిపారు. ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ కేవీఎస్ అప్పారావు, కోశాధికారి పి.కృష్ణప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, బి.కామ్ హెచ్‌ఓడీ ఎ.గ్రీష్మ అభినందించారు.

చిన్నారుల రక్షణకే పోక్సో

కై కలూరు(కలిదిండి): లైంగిక నేరాల నుంచి ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్స్ ఫ్రం సెక్సువల్ అఫెన్సెస్ యాక్టు (పోక్సో) చిన్నారులకు రక్షణగా నిలుస్తోందని కైకలూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎం.శివకిరణ్ చెప్పారు. కలిదిండి వివేకానంద ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాదులు పి.పవన్‌కాంత్, పి.ప్రసన్నకుమార్, ఎ.రాంబాబు, అలేఖ్య, స్కూల్ హెచ్ఎం జె.కరుణకుమారి, కలిదిండి పోలీసులు, పారా లీగల్ వలంటీర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి తవ్వేస్తున్నారు!



పెదముత్తేవి(మొవ్వ): పంట పొలాలు ఖాళీ అయి పట్టుమని వారం రోజులు తిరగక ముందే మట్టిని కొల్లగొట్టి డబ్బు చేసుకునే పనిలో అక్రమార్కులు నిమగ్నమయ్యారు. మొవ్వ మండలం పెదముత్తేవి గ్రామ ప్రజలు తెలిపిన వివరాల మేరకు గ్రామ శివారులోని అయినంపూడి డ్రైన్ (మురుగు కాలువ) సమీపంలోని పొలాల్లోంచి మట్టిని మనుషుల ద్వారా మెరక తీసి గ్రామంలోని రాజుల బజార్‌లో, బీసీ కాలనీల్లోని పలు ఇళ్లకు రాత్రి పగలు తేడా లేకుండా యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నారు. ట్రాక్టరు ఇంతని చెప్పి అమ్మకాలు జరిపి డబ్బులు దండుకుంటున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టీపట్టనట్లుగా వ్యవహరించటం గమనార్హం. దీనిపై గ్రామ వీఆర్వో తిరుమలరావుని వివరణ కోరగా గ్రామంలో ఎలాంటి తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు.

ఘనంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామి కల్యాణం

మండవల్లి: మండవల్లిలో కొలువై ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో గురువారం రాత్రి శ్రీ భ్రమరాంబదేవి, శ్రీ మల్లేశ్వరస్వామి వార్ల కల్యాణ మహోత్సవం ఎండోమెంట్స్ ఈఓ కె.దివ్యశ్రీ పర్యవేక్షణలో అత్యంత రమణీయంగా జరిగింది. గుడివాడ నాగబాబు దంపతులు పీటల మీద కూర్చున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముదినేపల్లి రూరల్: మండలంలోని అన్నవరం 11 కేవీ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఫీడర్ పరిధిలోని వడాలి నుంచి విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగిస్తారన్నారు.

కల్లాల్లోనే ధాన్యం...కర్షకుల్లో దైన్యం

- పూర్తి స్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేయని సర్కార్
- కొత్తగా బ్యాంక్ గ్యారంటీలకు వెసులుబాటు
- గిట్టుబాటు ధరలేక మూలుగుతున్న సన్న రకాలు



కల్లాల్లోనే మూలుగుతున్న ధాన్యం

పామర్రు: కూటమి సర్కారు పాలనలో రైతులు అడుగడుగునా నిర్లక్ష్యానికి గురవుతున్నారు. ఆదుకోవాల్సిన సర్కార్ తనకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో కొనుగోలు చేయకపోవడాన్ని గమనిస్తే అన్నదాతపై ప్రభుత్వం ఎంత చిన్నచూపు చూస్తోందో అర్థమవుతోంది. ఖరీఫ్‌లో పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో చాలా చోట్ల ఇప్పటికీ ధాన్యపు రాశులు కల్లాల్లోనే మూలుగుతున్నాయి. కొనుగోలు విషయంలో ఇచ్చిన లక్ష్యాలు పూర్తయినట్లు వ్యవసాయ అధికారులు రికార్డుల్లో చూపుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో కల్లాల్లో టన్నుల కొద్దీ ధాన్యం దర్శనమిస్తున్నాయి. అయితే మరోసారి బ్యాంకు గ్యారంటీల కోసం వెసులుబాటు కల్పించడంతో గ్రామాల్లో కూటమి నాయకులకు చెందిన వారికి అనుకూలంగా ట్రక్ షీట్లు నమోదు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పామర్రు నియోజకవర్గంలో పరిస్థితి ఇలా...

ఈ ఏడాది పామర్రు నియోజకవర్గంలో 1,58,830 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చినట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. ఇందులో 93,910 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు లక్ష్యాన్ని నిర్దేశించారు. లక్ష్యాన్ని అధిగమించి సుమారు 94,110 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు లెక్కలు చూపించారు. అయితే అధికారులు చూపిస్తున్న లెక్కలను చూసి రైతులు విస్తుపోతున్నారు. కొన్ని మండలాలలో ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతు సేవా కేంద్రాల్లో ట్రక్ షీట్లు నమోదు విషయంలో టీడీపీ కార్యకర్తల జోక్యంతో కేవలం వారికి అనుకూలంగా నమోదు ప్రక్రియ చేసుకుంటున్నారని మిగిలిన చోట్ల నమోదు చేసుకోవడం లేదని రైతులు విమర్శిస్తున్నారు.

రైతులను నట్టేట ముంచారు



ఈ ఏడాది ధాన్యం కొనుగోలు విధానం బాగోలేదు. పంట కొనుగోలు విషయంలో మిల్లర్లకు పూర్తి స్థాయిలో వెసులుబాటు ఇవ్వడంతో ఇష్టా రాజ్యంగా దోపిడీ జరిగింది. మిల్లర్లకు అనుకూలంగా దళారులు ట్రక్ షీట్లు నమోదు చేయించేవారు. ఇప్పుడు క్షేత్ర స్థాయిలో ధాన్యం నిల్వలు మూలుగుతున్నాయి. వీటితో పాటు రైతులు అధికంగా సన్నరకం ధాన్యం పండించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో క్వింటా ధాన్యం ధర రూ.2100 నుంచి రూ.2400 వరకు ఉండేది. ఇప్పుడు రూ.1700 నుంచి రూ.1800 వరకు మిల్లర్లు కొనుగోలు చేస్తున్నారు. దీంతో గిట్టుబాటు ధర లేక రైతులు దిగులు చెందుతున్నారు.

–కె.పెద వెంకటరెడ్డి, రైతు

టీడీపీ కార్యకర్తలే దళారీలు



ధాన్యం కొనుగోలు విషయంలో టీడీపీ కార్యకర్తలే మిల్లర్లకు దళారీలుగా వ్యవహరిస్తున్నారు. ట్రక్ షీట్ల నమోదు విషయంలో వారికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు గిట్టుబాటు ధర లేక పూర్తి స్థాయిలో కొనుగోలు జరగడం లేదు.

–రామదాసు, రైతు

విద్యార్థులకు అవగాహన సదస్సు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాస్

నందివాడ: మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు ట్రాఫిక్, ఇతర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు సక్రమమైన నడవడిక కలిగి ఉండాలని, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు చెప్పిన విషయాలు పాటించాలని, ఎటువంటి చెడు నడత కలిగి ఉండకుండా డ్రగ్స్, గంజాయి మత్తుపదార్థాలు వంటి వాటికి బానిస కాకుండా జాగ్రత్తగా ఉండాలని తెలిపి వారితో ప్రతిజ్ఞ చేయించారు. మత్తు పదార్థాల వల్ల యువత నాశనం కాకుండా ఉండటం కోసం కృష్ణాజిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక టీములు ఏర్పాటు చేసినట్టు తెలియజేశారు. దీనిలో భాగంగా గంజాయి రవాణా చేసేవారిని గంజాయి మత్తు పదార్థాలు తీసుకునే వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరిస్తామని తెలియజేశారు. గంజాయి మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం ఇవ్వవలసిందిగా కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. అనవసరమైన కేసుల్లో ఇరుక్కుని జీవితాల్ని నాశనం చేసుకోవద్దని తెలిపారు. ఈగల్ టీం, డయల్ 112, గుడ్ టచ్ – బ్యాడ్ టచ్, ట్రాఫిక్ నియమాలు, పోక్సో చట్టాలు సైబర్ నేరాలు వంటి వాటిపై అవగాహన కల్పించారు.

ఇఫ్తార్ విందులో డీఎన్నార్



కైకలూరు: పెద్ద మసీదు వద్ద గురువారం జరిగిన ఇఫ్తార్ విందులో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) పాల్గొని స్వయంగా వడ్డన చేశారు. కార్యక్రమంలో ముస్లిం వెల్ఫేర్ కమిటీ పెద్దలు, వైఎస్సార్ సీపీ కైకలూరు మండల అధ్యక్షుడు సింగంశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

ముదినేపల్లి రూరల్: అదనపు కట్నం వేధింపులపై ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐ వీరభద్రరావు తెలిపిన వివరాల ప్రకారం ముదినేపల్లికి చెందిన మహిళకు విజయవాడకు చెందిన అబ్దుల్ రెహమాన్‌తో మూడేళ్ల కిందట వివాహమైంది. వివాహ సమయంలో రెహమాన్‌కు రూ.5 లక్షలు కట్నంగా ఇచ్చారు. కొంతకాలం పాటు సంసారం సాఫీగానే జరిగింది. అయితే ఇటీవల భర్త రెహమాన్‌తో పాటు అత్త ముంతాజ్‌బేగం, మామ ఇస్మాయిల్ అదనపు కట్నం తీసుకురావాలంటూ శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నట్లు బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వీరభద్రరావు చెప్పారు.

నీటి సమస్య తలెత్తకుండా చూడాలి

ముదినేపల్లిరూరల్: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా సాగునీటి వినియోగదారుల సంఘాల సభ్యులు సహకరించాలని ముదినేపల్లి ఇరిగేషన్ సెక్షన్ జేఈ కిషోర్ అన్నారు. సెక్షన్ పరిధిలోని సంఘాల సభ్యులతో కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటకాలువల దిగువ వరకు ప్రధాన కాలువల నుంచి నీరు చేరే విధంగా సభ్యులు పర్యవేక్షించాలన్నారు. వచ్చే నెల మొదటి వారంలో ప్రధాన కాలువలకు తాగునీరు వదిలే అవకాశం ఉందని ఈ నీటితో మంచినీటి చెరువులను నింపాలని కోరారు. డ్రెయిన్లపై అక్రమ కట్టడాలు, ఆక్రమణలు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో డీసీ చైర్మన్ నారగాని కొండా, వైస్‌చైర్మన్ హనుమార పేర్నీడు, నీటి సంఘాల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

హోరాహోరీగా గుడివాడ బార్ అసోసియేషన్ ఎన్నికలు

- నేటి మధ్యాహ్నం జరగనున్న ఎన్నికల ప్రక్రియ
- ఓటు హక్కు వినియోగించుకోనున్న 203 మంది న్యాయవాదులు
- మూడు పదవులకు ఏకగ్రీవ ఎన్నిక

గుడివాడటౌన్: ది గుడివాడ బార్ అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం నిర్వహించనున్నారు. సీనియర్ న్యాయవాదులు కొడాలి హరినాథ్, తుమ్మలచర్ల శ్రీనివాసు ప్యానల్స్ పోటీలో ఉన్నాయి. కొడాలి హరినాథ్ గతంలో పలు మార్లు బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా పనిచేశారు. తుమ్మలచర్ల శ్రీనివాస్ కూడా గతంలో బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా పనిచేశారు. వీరిద్దరి మధ్య పోటీ రసవత్తరంగా సాగుతోందని న్యాయవాదులు అంటున్నారు. ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది పఠాన్ బాజీఖాన్ వ్యవహరిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఈ ఎన్నికల ప్రక్రియ జరుగుతుంది. మొత్తం 203 మంది న్యాయవాదులు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ఈ పోటీలో అధ్యక్ష పదవికి కొడాలి హరినాథ్, తుమ్మలచర్ల శ్రీనివాస్ పోటీ పడుతుండగా, ఉపాధ్యక్ష పదవికి ముగ్గురు, కార్యదర్శి పదవికి ముగ్గురు పోటీలో ఉన్నారు. ఉపాధ్యక్ష పదవికి విన్నకోట దుర్గాప్రసాదరావు, వై.రవీంద్రనాథ్, యశోద యామిని రేసులో ఉండగా, కార్యదర్శి పదవికి బి.క్రాంతి, సీహెచ్ రమణ, ఎం.నటరాజ్ పోటీ పడుతున్నారు. కోశాధికారి పదవికి యు.కోటేశ్వరరావు, కేవీఆర్‌కే రెడ్డి, లైబ్రరీ సెక్రటరీగా కుటుంబరావు, పీవీ రాజు తలపడుతున్నారు. జాయింట్ సెక్రటరీగా గంటా తిరుమలరావు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా ఎం.లక్ష్మి, మహిళా ప్రతినిధిగా సీహెచ్ ప్రమీలా రాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పాత్రికేయునిపై దాడి అమానుషం



కైకలూరు ఏరియా ఆస్పత్రిలో పాత్రికేయుడు కిషోర్‌ను పరామర్శిస్తున్న డీఎన్నార్

కై కలూరు: కూటమి నేతల వివాదాన్ని ఫొటోలు తీస్తున్న పాత్రికేయునిపై మూకుమ్మడి దాడి చేయడం అమానుషమని వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. కై కలూరు మండలం భుజబలపట్నం గ్రామంలో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యుడు పెన్మత్స సూర్యనారాయణరాజును నిర్బంధించారనే విషయాన్ని తెలుసుకుని వెళ్లిన కైకలూరు భవ్య న్యూస్ ఎడిటర్ కురేళ్ళ కిషోర్‌పై కూటమి నేతలు మూకుమ్మడి దాడి చేశారన్నారు. కై కలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న కిషోర్‌ను డీఎన్నార్ గురువారం పరామర్శించారు. మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించాలని వైద్య సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కైకలూరు మండల అధ్యక్షుడు సింగంశెట్టి రాము, నాయకులు పంజా రామారావు, బుర్ల కిరణ్, తమ్మిశెట్టి కొండ, కన్నా రమేష్, పిచ్చేటి పెద్దిరాజు, బోడిచర్ల ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ జరపాలి



పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతికి పామర్రులో నిరసన తెలుపుతున్న పాస్టర్ల సంఘ నాయకులు

పామర్రు: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి తీవ్ర సంతాపాన్ని తెలుపుతున్నట్లు పామర్రు మండల పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ రెవ. కె.యేసుదాసు తెలిపారు. స్థానిక పీఎంపీఎఫ్ వద్ద ప్రవీణ్ మృతికి సంతాపాన్ని తెలుపుతూ గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పి.సునీల్ పురుషోత్తం, కార్యదర్శి ఎన్.శామ్యూల్, కోశాధికారి బి.ఇశ్రాయేల్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక శివరామ కాంప్లెక్స్ వద్ద...

పాస్టర్ ప్రవీణ్ మృతికి సంతాపం తెలుపుతూ గురువారం స్థానిక శివరామ కాంప్లెక్సులో గురువారం సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు రెవ.సాల్మన్ కొల్లాబత్తుల మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మృతి అనుమానాస్పదంగా ఉందని, దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించి, ప్రవీణ్ కుటుంబ సభ్యులకు తగు న్యాయం చేయాలని అన్నారు. పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతి క్రైస్తవ సమాజానికి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో మండల పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ అధ్యక్షుడు జి.కృపాసాగర్, పాస్టర్లు చంటిబాబు, సునీల్, ఎబినేజర్, పాల్‌రాజు, ఇశ్రాయేలు, శామ్యూల్, జంపుల కోటేశ్వరరావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో...

ముదినేపల్లి రూరల్: మత ప్రబోధకుడు ప్రవీణ్‌కుమార్ మృతిపై ప్రభుత్వం న్యాయ విచారణ జరిపించాలని పలువురు పాస్టర్లు డిమాండ్ చేశారు. ప్రవీణ్ మృతికి నిరసనగా ముదినేపల్లి మండలంలోని పాస్టర్లు గురువారం ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించి అనంతరం ఎస్ఐ వీరభద్రరావుకు వినతిపత్రం అందజేశారు.

ఇందిరా రాణి సేవలు నిరుపమానం



హెచ్ఎం ఇందిరా రాణి దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు: పామర్రు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎంగా ఇందిరా రాణి చేసిన సేవలు నిరుపమానమని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. ఇందిరారాణి పదవీ విరమణ సందర్భంగా గురువారం స్థానిక హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 30 ఏళ్లకు పైబడి ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ ఎంతోమంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దారని, ఉన్నతాధికారుల మన్ననలు పొందారని అన్నారు. ఆమె శేష జీవితం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం హెచ్ఎం ఇందిరా రాణి దంపతులను ఎమ్మెల్యే శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం పాఠశాల సిబ్బంది అందరూ కలిసి ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కైకలూరు వైస్ ఎంపీపీ ఎన్నిక వాయిదా

- హాజరుకాని వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు
- భుజబలపట్నం వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ ఇంటికి తాళాలు
- కోరం లేకపోవడంతో నేటి ఉదయం 11 గంటలకు వాయిదా



ఎన్నికలు వాయిదా పడినట్లు ప్రకటిస్తున్న ఏలూరు ఆర్డీవో అచ్చుత అంబరీష్

కైకలూరు: ఉత్కంఠతో కొనసాగిన కైకలూరు వైస్ ఎంపీపీ ఎన్నికను కోరం లేకపోవడంతో ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్ శుక్రవారం ఉదయం 11 గంటలకు వాయిదా వేశారు. మండల పరిషత్ కార్యాలయం హాలులో గురువారం ఉదయం 11 గంటలకు కూటమికి చెందిన ఎంపీపీ అడవి కృష్ణ, దొడ్డిపట్ల ఎంపీటీసీ కర్ణం వెంకట లక్ష్మి దుర్గాశ్రీదేవి, శృంగవరప్పాడుకు చెందిన ఘంటసాల నాగమణి, ఆలపాడుకు చెందిన నల్లగచ్చు ధనలక్ష్మి, వరహాపట్నంకు చెందిన పందు గాంధీ ప్రసాద్, పందిరిపల్లిగూడెంకు చెందిన బలే నరసింహారావు, వేమవరప్పాడుకు చెందిన బోడావుల తిరుపతిరాజు, కై కలూరు 2 ఎంపీటీసీ మంగినేని రామకృష్ణ, చటాకాయి ఎంపీటీసీ సైదు లక్ష్మి హాజరయ్యారు. వీరందరూ వైఎస్సార్‌సీపీ గుర్తుపై గెలిచిన వారు కావడం విశేషం. టీడీపీకి చెందిన తామరకొల్లు ఎంపీటీసీ గంగుల వెంకట నరసమ్మ హాజరు కాలేదు. దీంతో కూటమి ఎంపీటీసీల సంఖ్య 9కి చేరింది. వైఎస్సార్‌సీపీకి చెందిన ఎంపీటీసీలు ఎవరూ ఎన్నికల్లో పాల్గొనలేదు. కూటమి పార్టీలో 10 మందితో కోరం లేకపోవడంతో ఆర్డీఓ వాయిదా వేశారు.

భుజబలపట్నం ఎంపీటీసీ సభ్యుడి నిర్బంధం

వైఎస్సార్‌సీపీకి చెందిన భుజబలపట్నం ఎంపీటీసీ సభ్యుడు పెన్మత్స సూర్యనారాయణరాజు కైకలూరులో ఎన్నికల్లో పాల్గొనాల్సి ఉంది. ఎంత సేపటికీ రాకపోవడంతో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) కారులో భుజబలపట్నం ఎంపీటీసీ ఇంటికి వెళ్లారు. ఇంతలో కూటమి నేతలు, గ్రామస్తులు కొందరు వచ్చి ఆయనను బయటకు తీసుకెళ్లడానికి ప్రయత్నించగా ఎంపీటీసీ స్పృహ కోల్పోయారు. దీంతో ఎంపీటీసీ తన ఇంటికే పరిమితమయ్యారు. గొడవ పెరగడంతో డీఎన్నార్‌ను పోలీసులు కారులో కై కలూరు పంపించారు. బుధవారం రాత్రి ఎంపీటీసీ ఇంటికి తాళాలు వేసి లోపల ఉంచారని సమాచారం. భుజబలపట్నం ఎంపీటీసీ రాకపోవడంతో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు ఎన్నికల్లో పాల్గొనలేదు.

ఉప సర్పంచ్‌ల ఎన్నిక

కైకలూరు నియోజకవర్గంలో నాలుగు పంచాయతీలకు ఉప సర్పంచ్ ఎన్నికలు జరిగాయి. కలిదిండి మండలం భాస్కరరావుపేటలో సాలి మేరమ్మకుమారి, మండవల్లి మండలం లోకుమూడిలో వెంట్రపాటి నిర్మల, మూడుతాళ్ళపాడు గ్రామంలో వీరబత్తిన జీవమ్మ ఏకగ్రీవంగా ఉపసర్పంచ్‌గా ఎంపికయ్యారు. ముదినేపల్లి మండలం ప్రొద్దువాక గ్రామంలో వైఎస్సార్ సీపీ మద్దతుదారు దొడ్డాకుల వీరాంజనేయులు ఉప సర్పంచ్‌గా ఎన్నికయ్యారు.

ఉప సర్పంచ్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ హవా



యాకమూరులో బూరి సాంబమూర్తిని అభినందిస్తున్న సర్పంచ్ గాదె కనకదుర్గ



పేరుబోయిన జేజమ్మను అభినందిస్తున్న సర్పంచ్ నందేటి గంగాభవాని, ఎంపీటీసీ మధుబాబు

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు మండలంలో జరిగిన ఉప సర్పంచ్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారులు విజయపతాకం ఎగురవేశారు. మండలంలోని యాకమూరు, పెనమకూరు గ్రామ పంచాయతీలలో ఉప సర్పంచ్‌లు రాజీనామా చేయటంతో అధికారులు గురువారం ఎన్నిక నిర్వహించారు. యాకమూరులో 10వ వార్డు సభ్యుడు బూరి సాంబమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పెనమకూరులో ఉప సర్పంచ్ పదవిని కై వసం చేసుకునేందుకు టీడీపీ నేతలు విశ్వప్రయత్నం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు వీరపనేని శివరామ్ స్వగ్రామం కావటంతో ఎలాగైనా టీడీపీ మద్దతు దారుడిని ఉప సర్పంచ్ చేయాలని ఆ పార్టీ నాయకులు చేసిన వ్యూహరచన బెడిసికొట్టింది. ఇరు పార్టీలకు చెరొక ఐదుగురు వార్డు సభ్యులు మద్దతు తెలపగా, సర్పంచ్ నందేటి గంగాభవాని ఓటుతో వైఎస్సార్ సీపీ మద్దతుదారురాలు, 10 వ వార్డు సభ్యురాలు పేరుబోయిన జేజమ్మ ఎన్నికయ్యారు. దీంతో టీడీపీ వర్గాలు కంగుతిన్నాయి. ఏకపక్షంగా సాగిన ఉప సర్పంచ్‌ల ఎన్నికతో మండలంలో వైఎస్సార్ సీపీకి తిరుగులేదనే విషయం మరోసారి నిరూపితమైంది. ఉప సర్పంచ్‌లుగా ఎన్నికైన బూరి సాంబమూర్తి, పేరుబోయిన జేజమ్మను యాకమూరు, పెనమకూరు సర్పంచ్‌లు గాదె కనకదుర్గ, నందేటి గంగాభవాని, ఎంపీటీసీ సభ్యుడు మరీదు శివమధుబాబు, మాజీ సర్పంచ్ మరీదు నాగేశ్వరరావు, నాయకులు గాదె కిషోర్‌రెడ్డి, గాదె సురేంద్రరెడ్డి, ఆరేపల్లి వెంకటేశ్వరరావు, బోలెం శ్రీనివాసరావు శాలువాలు, పూలమాలలతో అభినందించారు.

నాలుగు ఉపసర్పంచ్ పదవులు ఏకగ్రీవం

ఎన్నికైన వారిలో ఇద్దరు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు



తాడంకి ఉపసర్పంచ్‌గా ఎన్నికైన కొల్లి లక్ష్మికి ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న పీఓ వెంకటేశ్వరరావు

పమిడిముక్కల: మండలంలోని తాడంకి, మంటాడ, అమీనాపురం, ఫత్తేలంక గ్రామాల ఉపసర్పంచ్ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. నలుగురు ఉపసర్పంచ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తాడంకి ఉపసర్పంచ్‌గా వైఎస్సార్‌సీపీ మద్దతుదారు కొల్లి లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి, ఎంపీడీఓ దేవరపల్లి వెంకటేశ్వరరావు లక్ష్మికి ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. సర్పంచ్ జంపాన లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు కూచిపూడి శ్రీలక్ష్మి, వార్డు సభ్యులు లక్ష్మిని అభినందించి సత్కరించారు. పంచాయతీ కార్యదర్శి భవాని ఎన్నిక కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఫత్తేలంక ఉపసర్పంచ్‌గా వైఎస్సార్‌సీపీ మద్దతుదారు లాల్‌అహ్మద్ కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఉయ్యూరు ఈఓఆర్డీ ఏఎస్ఆర్ కోటేశ్వరరావు వ్యవహరించారు. అమీనాపురం ఉపసర్పంచ్‌గా టీడీపీ మద్దతుదారు నందేటి దుర్గాప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా మొవ్వ ఈఓఆర్డీ పరమాత్మ వ్యవహరించారు. మంటాడ ఉపసర్పంచ్‌గా కూటమి అభ్యర్థి కాలపురెడ్డి రమాదేవిని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఎన్నికల అధికారిగా పామర్రు ఈఓఆర్డీ కిషోర్ వ్యవహరించారు.

ఉపసర్పంచ్‌గా దొడ్డాకుల వీరాంజనేయులు



దొడ్డాకులను అభినందిస్తున్న సభ్యులు

ముదినేపల్లి రూరల్: ప్రొద్దువాక పంచాయతీ ఉపసర్పంచ్‌గా దొడ్డాకుల వీరాంజనేయులు ఎన్నికయ్యారు. ఇప్పటివరకు ఉపసర్పంచ్‌గా పనిచేసిన పి.రాజ్యలక్ష్మి రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక జరిగింది. దొడ్డాకులతో పాటు ఉపసర్పంచ్ పదవికి గునుకుల నారాయణ అనే మరో సభ్యుడు పోటీ పడ్డారు. ఈ పోటీలో దొడ్డాకులకు 7 ఓట్లు రాగా నారాయణకు 2ఓట్లు రావడంతో 5 ఓట్ల మెజార్టీతో దొడ్డాకుల గెలుపొందారు. రిటర్నింగ్ అధికారి అశోక్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. గెలుపొందిన దొడ్డాకుల వీరాంజనేయులును పూలమాలలు, శాలువాలతో పంచాయతీ పాలకవర్గ సభ్యులు అభినందించారు.

శేరీకల్వపూడి ఉప సర్పంచ్‌గా వెంకటేశ్వరమ్మ ఎన్నిక

గుడ్లవల్లేరు: మండలంలోని శేరీ కల్వపూడి గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌గా టీడీపీకి చెందిన గోగుల మూడి వెంకటేశ్వరమ్మ ఎన్నికయ్యారు. మొత్తం ఎనిమిది మంది సభ్యుల్లో నలుగురు సభ్యులు టీడీపీ వార్డు సభ్యురాలికి మద్దతు ఇవ్వడంతో ఉప సర్పంచ్ పదవి టీడీపీ కైవసం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. వెంకటేశ్వరమ్మను పుష్పగుచ్ఛాలతో టీడీపీ నాయకులు కొడాలి రామరాజు, చలసాని శ్రీధర్, అట్లూరి శ్రీరామచంద్రప్రసాద్ అభినందించారు.